మహాశివరాత్రికి ఆలయాల ముస్తాబు



రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో ముస్తాబైన శివాలయం

రాజేంద్రనగర్: మహా శివరాత్రి పర్వదినానికి రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని శివాలయాలు ముస్తాబవుతున్నాయి. ఇప్పటికే వివిధ రకాల రంగులతో పెయింటింగ్ వేశారు. ప్రస్తుతం విద్యుత్ దీపాలను అలంకరిస్తుండగా సర్కిల్ పరిధిలోని శివాలయం వెలుగులతో విరజిల్లుతున్నది. సర్కిల్ పరిధిలో దాదాపు 80కి పైగా శివాలయాలు ఉన్నాయి. శివరాత్రికి శివాలయం కమిటీ సభ్యులు భారీ ఏర్పాట్లు చేపడుతున్నారు. దేవాలయాలకు వచ్చే వారికి ఇబ్బందుల్లేకుండా సౌకర్యాలు కల్పిస్తున్నారు. శివరాత్రి రోజున ప్రత్యేక పూజలు, హోమాలు, శివ పార్వతుల కల్యాణ మహోత్సవాలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా అభిషేక టోకెట్లను విక్రయించడం ప్రారంభించారు.

ముగిసిన ఓటరు అవగాహన కార్యక్రమం



ప్రతిజ్ఞ చేస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

రాజేంద్రనగర్: కేంద్ర విద్య, యువజన వ్యవహారాల మంత్రిత్వ శాఖల సూచన మేరకు సీబీఐటీలో 'మేరా ఫెహ్లా ఓటు దేశ్ కే లియే' పేరిట నిర్వహించిన ఓటర్ అవగాహన కార్యక్రమం బుధవారం ముగిసింది. చివరిరోజు ముఖ్య అతిథిగా నార్సింగి మున్సిపాలిటీ కమిషనర్ ప్రవీణ్ కుమార్ రెడ్డి హాజరై ఓటు, దాని విలువను వివరించారు. ప్రజాస్వామ్యంలో ఓటు అనేది వజ్రాయుధం అని పేర్కొన్నారు. కళాశాల ప్రిన్సిపాల్, ప్రొఫెసర్ సి.వి.నర్సింహులు ప్రజల ద్వారా, ప్రజల కోసం అబ్రహం లింకన్ అన్న మాటల గురించి చెప్పారు. ప్రజాస్వామ్య దేశంలోని ప్రజలు ఎలాంటి ఒత్తిడి లేకుండా ప్రభుత్వాన్ని స్వేచ్ఛగా ఎన్నుకోవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమాన్ని ఎన్నికల అక్షరాస్యత క్లబ్–సీబీఐటీ నిర్వహించింది.

ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో..

మహాత్మగాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో భారత ప్రభుత్వ మంత్రిత్వ శాఖ ఇచ్చిన ఆదేశాలతో 'మేరా పహ్‌లా ఓట్ దేశ్ కే లియే' కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సదస్సులో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.చంద్రమోహన్ ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులు, సిబ్బందిని ఉద్దేశించి ఓటు, దాని ప్రాముఖ్యతను వివరించారు. యువత తమ ఓటును ఖచ్చితంగా వినియోగించుకుని సరైనా నాయకునిడి ఎన్నుకోవాలని.. అప్పుడే దేశ అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ జి.బాల్‌రెడ్డి, డాక్టర్ ఎం.రవీందర్, డాక్టర్ సీహెచ్.శ్రీనివాస్, డాక్టర్ బర్నబాసి, డాక్టర్ ఎస్.రామకృష్ణ, వర్మ, డాక్టర్ సైదులు, మహేశ్, డాక్టర్ శ్రీహరి పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న నార్సింగి మున్సిపాలిటీ కమిషనర్ ప్రవీణ్ కుమార్ రెడ్డి

పాతబస్తీలో మెట్రో శంకుస్థాపనకు ఏర్పాట్లు

బందోబస్తును పరిశీలించిన దక్షిణ మండలం డీసీపీ



సభాస్థలి ఆవరణలో బందోబస్తును పరిశీలిస్తున్న డీసీపీ సాయిచైతన్య

చాంద్రాయణగుట్ట: పాతబస్తీలో మెట్రో రైలు నిర్మాణానికి సంబంధించి ఫలక్‌నుమా ఫారూఖ్‌నగర్ డిపో ఆవరణలో ఈనెల 8న సీఎం రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేయనున్న నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు ఏర్పాట్లలో తలామునకలయ్యారు. ఫారూఖ్‌నగర్ బస్సు టెర్మినల్ ఆవరణలో వేదికను ఏర్పాటు చేస్తుండగా.. ప్రధాన రహదారిని ఆనుకుని శిలాఫలకాన్ని ఏర్పాటు చేశారు. వేదిక పరిసరాల్లో తీసుకోవాల్సిన బందోబస్తు విషయమై దక్షిణ మండలం డీసీపీ సాయి చైతన్య, అదనపు డీసీపీ షేక్ జహంగీర్, ఫలక్‌నుమా ఏసీపీ బి.వై.స్వామి, ఇన్‌స్పెక్టర్ ఆదిరెడ్డిలు బుధవారం సాయంత్రం పర్యవేక్షించారు. వాహనాల పార్కింగ్, వీవీఐపీల వచ్చిపోయే రూట్ తదితర అంశాలపై క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇక విద్యుత్ ఇబ్బందులు తలెత్తకుండా ఫలక్‌నుమా ఏడీఏ రాజు ఆధ్వర్యంలో చర్యలు చేపట్టారు. ముఖ్యమంత్రి వచ్చే రూట్‌లో ఎలాంటి అడ్డంకులు లేకుండా జీహెచ్ఎంసీ అధికారులు కూడా పనులను వేగవంతం చేయడంతో పాటు పారిశుద్ధ్యంపై స్పెషల్ డ్రైవ్, ఫుట్‌పాత్‌లకు రంగులద్దుతున్నారు.

కాంగ్రెస్ నేతల హర్షం..

పాతబస్తీలో మెట్రో రైలు నిర్మాణానికి శంకుస్థాపన జరుగుతుండటంతో పాతబస్తీలోని కాంగ్రెస్ నాయకుల్లో కొత్త జోష్ నెలకొంది. పదేళ్ల అనంతరం కాంగ్రెస్ అధికారంలోకి రావడంతోనే పాతబస్తీ ప్రజల చిరకాల ఆకాంక్షగా ఉన్న మెట్రో రైలు రాబోతుందని హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈనెల 8న ఫలక్‌నుమాలో ముఖ్యమంత్రి చేతుల మీదుగా శంకుస్థాపన జరుగనున్న నేపథ్యంలో పలువురు కాంగ్రెస్ నాయకులు సభాస్థలి పరిసరాలను పరిశీలిస్తూ.. సందడి చేశారు. పార్టీ నాయకులు కె.వెంకటేష్, మహ్మద్ మూసా కాసీం, మనోజ్, అనిల్, శ్యామ్‌రావు ముదిరాజ్, ఫెరోజ్, ఘనీ, జాహెద్, ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

శంకుస్థాపన కార్యక్రమంపై సమీక్ష..

ఈనెల 8న పాతబస్తీలో మెట్రోరైలుకు సీఎం రేవంత్‌రెడ్డి శంకుస్థాపనను పురస్కరించుకుని గాంధీభవన్‌లో పాతబస్తీ నాయకులతో సమీక్ష కార్యక్రమం కొనసాగిందని పార్టీ ఎస్టీసెల్ రాష్ట్ర కో–ఆర్డినేటర్ కె.గణేష్ రాథోడ్ తెలిపారు. మంత్రి పొన్నం ప్రభాకర్, రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్‌యాదవ్‌ల సమక్షంలో జరిగిన ఈ సమీక్షలో చాంద్రాయణగుట్ట, బహదూర్‌పురా ఇన్‌చార్జిలు బోయ నగేష్, రాజేష్, స్థానిక నాయకులు ప్రమోద్‌రెడ్డి, రోహిన్‌రెడ్డి పాల్గొన్నారన్నారు.

ఆస్పత్రిలో దోమల నివారణకు చర్యలు



ఆస్పత్రిలో దోమల మందు పిచికారీ చేస్తున్న దృశ్యం

గోల్కొండ: గోల్కొండ ఏరియా ఆస్పత్రిలో ఇన్‌పేషంట్లకు దోమల బెడద లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని గోల్కొండ ఏరియా ఆసుపత్రి మెడికల్ సూపరెంటెండెంట్ డాక్టర్ మహ్మద్ మజహరుల్లా అన్నారు. బుధవారం ఆయన ఆసుపత్రిలో జరుగుతున్న దోమలమందు పిచికారీ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రస్తుతం తమ ఆస్పత్రి ఇన్‌పేషంట్ విభాగం వందశాతం ఆక్యూపెన్సీతో ఉంటుందన్నారు. ఆస్పత్రిలో పేషంట్లకు ఇబ్బందులు కలగకుండా ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య పనులు నిర్వహిస్తున్నామన్నారు. దోమలు వృద్ధి చెందకుండా వారానికి రెండు సారు బల్దియా ఎంటమాలజీ విభాగం సిబ్బందితో దోమల మందు స్ప్రే చేయిస్తున్నామన్నారు. ఐసీయూ విభాగంతో పాటు ఆస్పత్రి భవనంలోని మొదటి అంతస్తులో ఉన్న వాటర్ ప్లాంట్, డస్ట్‌బిన్ ఏరియాలలో దోమలు వృద్ధి చేయకుండా స్ప్రేయింగ్ చేయించామన్నారు. బల్దియా ఎంటమాలజీ విభాగం సూపర్‌వైజర్ ఇంతియాజ్ పర్యవేక్షణలో దోమల మందు స్ప్రేయింగ్ చేశామన్నారు.

భూ సమస్యలు పరిష్కారం అయ్యేనా?

- ధరణి పోర్టల్ దరఖాస్తుల పరిశీలనకు స్పెషల్ డ్రైవ్
- ఈ నెల 9 వరకు కొనసాగనున్న కార్యక్రమం
- శంషాబాద్ మండలంలో 1811 అర్జీల పెండింగ్
- ఇప్పటివరకు 80 పరిశీలన

శంషాబాద్ రూరల్: ధరణి పోర్టల్‌లోని పెండింగ్ భూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నా సర్కారు ఆదేశాలతో అధికారులు ఈ నెల 1 నుంచి ధరణి స్పెషల్ డ్రైవ్‌ను చేపడుతున్నారు. అయితే ఈ నెల 9 వరకు మాత్రమే గడువు ఉండడంతో సమయంలోగా దరఖాస్తుల పరిశీలన పూర్తి అవుతుందో..? లేదోనని..? రైతుల్లో ఆందోళన నెలకొన్నది. మండలంలో మొత్తం 1811 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా వీటి పరిశీలనకు రెవెన్యూ అధికారులు కార్యాచరణ చేపట్టారు.

రికార్డుల పరిశీలన..

మీ సేవ ద్వారా ధరణి పోర్టల్‌లో నమోదు చేసిన దరఖాస్తులు, వీటికి సంబంధించి రెవెన్యూ రికార్డులు, దరఖాస్తుదారులు అందజేసిన పత్రాలను పరిశీలిస్తున్నారు. అవసరమైతే క్షేత్రస్థాయిలో పర్యటించి వివరాలు సేకరిస్తున్నారు. ఇప్పటి వరకు సుమారు 80 దరఖాస్తులు పరిశీలించినట్లు అధికారులు పేర్కొంటున్నారు.

ధరణి రాకతో కొత్త సమస్యలు..

గత బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకువచ్చిన ధరణి పోర్టల్‌తో కొత్తగా భూ సమస్యలు తలెత్తాయి. సర్వే నంబర్ల నమోదులో తప్పిదాలు, రికార్డుల్లో మార్పులు, భూ విస్తీర్ణంలో వ్యత్యాసాలు వంటి అనేక పొరపాట్లు జరిగాయి. అప్పటివరకు తమ పేర్లతో ఉన్న భూముల రికార్డులు తారుమారు కావడంతో రైతులు ఇబ్బందులకు గురయ్యారు. నవరణల కోసం మీసేవలో దరఖాస్తు చేసుకుని ఏళ్లు గడుస్తున్నా ఇప్పటికీ వరిష్కారానికి నోచుకోలేదు.

మాడ్యూళ్లు ఇవే..

తొలి విడుతలో పరిష్కార వెసులుబాటు కల్పించిన మాడ్యూళ్ల ప్రకారం జాబితా రూపొందిస్తున్నారు. కోర్టు ఉత్తర్వులతో పాసు పుస్తకాల జారీ, నిషేధిత జాబితాలో ఉన్న భూములు, ఆస్తులు, సెమీ అర్బన్ భూముల పాస్‌పుస్తకాల జారీ, కోర్టు కేసుల సమాచారం, మ్యుటేషన్లు, జీపీఏ, ఎస్పీఏ, ఆధార్ సమస్యలు, వారసత్వ హక్కుల కల్పన (అసైన్డ్ భూములకు కూడా), ఖాతాల విలీనం, పాసు పుస్తకంలో వివరాలు సరిచేయడం, తదితర సమస్యల పరిష్కారం కోసం మాడ్యూళ్లు తయారు చేస్తున్నారు



క్షేత్రస్థాయిలో పరిశీలించి వివరాలు నమోదు చేసుకుంటున్న తహసీల్దార్ నాగమణి

పట్టాభూమిని సీలింగ్ ల్యాండ్‌గా మార్చారు..



మల్కారం రెవెన్యూలోని సర్వే నంబరు 30/ఆలో 34 గుంటల భూమిని 2001లో కొనుగోలు చేశాను. ధరణి రావడంతో ఈ పట్టా భూమిని సీలింగ్ భూమిగా రికార్డుల్లో చేర్చారు. దీంతో 2022 లో మీసేవలో దరఖాస్తు చేసుకుంటే ఇప్పటికీ పరిష్కారం కాలేదు. ఆఫీసుల చుట్టూ ఎన్నిసార్లు తిరిగినా ఫలితం లేదు.

కొత్త మాధవరెడ్డి, రైతు, మల్కారం

త్వరగా పరిశీలిస్తాం..



మా దగ్గర ఉన్న దరఖాస్తులను త్వరగా పరిశీలించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. గతంలోనే 50 శాతం వరకు పరిశీలించాం. కొంత మంది ఒకటి కంటే ఎక్కువ దరఖాస్తులు అందజేశారు. వాటిని క్రోడీకరించి రికార్డులు పరిశీలిస్తున్నాం. అవసరమైతే క్షేత్రస్థాయిలో పరిశీలించి వివరాలు సేకరిస్తున్నాం.

కె.నాగమణి, తహసీల్దార్, శంషాబాద్

జీవశాస్త్ర పరిశోధనలతో సమాజ వికాసం

గన్‌ఫౌండ్రీ: జీవశాస్త్ర రంగంలో నూతన ఆవిష్కరణలు రావడం వల్ల విద్య, ఉపాధితో పాటు సమాజ వికాసానికి ఎంతో అవకాశం ఉందని తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్ ప్రొఫెసర్ ఎస్‌కె.మహ్మద్ అన్నారు. బుధవారం నిజాం కళాశాలలో మైక్రో బయోలజీ శాఖ ఆధ్వర్యంలో ఇన్నొవేషన్స్ ఇన్ మైక్రో బీఎల్ బయోటెక్నాలజీ అనే అంశంపై రెండ్రోజుల జాతీయ సదస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రపంచ పోటీని దృష్టిలో పెట్టుకుని విద్యార్థులతో పాటు అధ్యాపకులు కూడా నూతన విజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని సూచించారు. జీవశాస్త్ర రంగంలో హైదరాబాద్ హబ్‌గా మారిందన్నారు. భవిష్యత్తులో రోబోటిక్, బయోఫార్మా, సైబర్ సెక్యూరిటీ, క్లౌడ్ కంప్యూటింగ్ మొదలైన వాటికి భవిష్యత్తు ఉందని ఆయా రంగాలపై విద్యాసంస్థలు దృష్టి సారించాలన్నారు. నిజాం కళాశాల ప్రిన్సిపాల్ భీమా, సదస్సు కన్వీనర్ ప్రొఫెసర్ చాంద్‌పాషా, ప్రొఫెసర్ బుర్రి రంగారెడ్డి, ప్రొఫెసర్ ఎల్.వేంకటేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఫార్మా రంగానికి ఉజ్వల భవిష్యత్

బంజారాహిల్స్: ఫార్మా రంగానికి ఉజ్వల భవిష్యత్ ఉందని, విద్యార్థులు రోజురోజుకు వస్తున్న సరికొత్త సాంకేతికతను అందుపుచ్చుకుంటూ ముందుకు సాగాలని ఫార్మాస్యూటికల్ ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఈడీ రాజాభాను అన్నారు. బుధవారం బంజారాహిల్స్‌లోని సుల్తాన్ ఉల్ ఉలూం ఫార్మసీ కాలేజీలో నేషనల్ ఫార్మసీ ఎడ్యుకేషన్ డేలో భాగంగా నిర్వహించిన ఫార్మా అన్వేషణ్–2024 సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. 1937లో మహదేవ్ రావ్ లాల్ ష్రాఫ్ బీఫార్మసీ కోర్సును ప్రారంభించారని అందువల్ల ఆయన పుట్టిన రోజైన మార్చి 6ను నేషనల్ ఫార్మసీ ఎడ్యుకేషన్‌డేగా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తున్నదని అన్నారు. ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఈసీ మెంబర్ ఎం.వెంకట రమణ మాట్లాడుతూ... రానున్న రోజుల్లో ఫార్మసీలో రెండు సంవత్సరాలు చదివితే డిప్లొమా పట్టా, నాలుగు సంవత్సరాలు చదివితే డిగ్రీ పట్టా, ఆరు సంవత్సరాలు చదివితే మాస్టర్స్ డిగ్రీ ఇచ్చేలా విద్యాచట్టాన్ని రూపొందించినట్లు తెలిపారు. హైదరాబాద్ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ టి. సుమాలిని, ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సెంట్రల్ కౌన్సిల్ మెంబర్ వి. ప్రభాకర్‌రెడ్డి, సుల్తాన్ ఉలూం ఫార్మసీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ అనుపమ కోనేరు తదితరులు పాల్గొన్నారు.

స్పా ముసుగులో వ్యభిచారం

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డు నెంబర్–1లోని రిలయన్స్ క్లాసిక్ బిల్డింగ్‌లో కొనసాగుతున్న లక్కీ బ్యూటీ అండ్ స్పాలో మసాజ్ ముసుగులో వ్యభిచారం నిర్వహిస్తుండగా బంజారాహిల్స్ పోలీసులు సోదాలు నిర్వహించి స్పా నిర్వాహకులపై కేసు నమోదు చేశారు. వివరాలివీ... లక్కీ బ్యూటీ అండ్ స్పాలో కొంతకాలంగా థెరపిస్టుల పేరుతో యువతులను రప్పించి వారితో మసాజ్ ముసుగులో వ్యభిచారం చేయిస్తున్నట్లు ఫిర్యాదులు అందాయి. దీంతో బంజారాహిల్స్ పోలీసులు ఈ స్పాపై దాడి చేసి ఐదుగురు యువతులను రెస్క్యూ హోంకు తరలించారు. నిర్వాహకులపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వసతుల కల్పనకు దాతలు ముందుకు రావాలి



ప్రభుత్వ పాఠశాలలో డోర్లు రిపేర్ చేయిస్తున్న నవయువ యూత్ క్లబ్ సభ్యులు

మైలార్‌దేవ్‌పల్లి: ప్రభుత్వ పాఠశాలలో వసతుల కల్పనకు దాతలు ముందుకు రావాలని నవయువ యూత్ క్లబ్ అధ్యక్షుడు ఏర్వ కుమారస్వామి కోరారు. సభ్యులతో కలిసి బుధవారం మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని ఉడంగడ్డ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలోని డోర్‌లను రిపేర్ చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలో కనీస వసతులు కల్పించడంలో ప్రభుత్వం విఫలం అయ్యిందన్నారు. డోర్లు కిటికీలు శిథిలావస్థకు చేరడంతో దుర్గానగర్ ప్రాంతానికి చెందిన కొత్వల్ నరహరి సహాయంతో వాటికి మరమ్మతు చేయించామని తెలిపారు. ఏడాది కాలంగా దాతల సహాయంతో పాఠశాలలో వసతులు కల్పిస్తున్నామని పేర్కొన్నారు. ఇంకా ప్రభుత్వ పాఠశాలలో తాగు, వాడుక నీరు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఎవరైనా దాతలు ముందుకు వచ్చి సౌకర్యాలు కలిప్పంచాలని విన్నవించారు. ప్రధానోపాధ్యాయుడు రాంచందర్, రమేశ్‌రెడ్డి, వల్లపు జగన్ తదితరులు ఉన్నారు.


తయారీ రంగంపై ప్రత్యేక దృష్టి సారించాలి



ఐఐఎం నాగపూర్ డైరెక్టర్ ప్రొ.బీమరాయకు జ్ఞాపికను అందిస్తున్న వీసీ బీజేరావు

రాయదుర్గం: భారతదేశం ఆర్థికంగా నిలదొక్కుకుంటోందని ఐఐఎం నాగపూర్ డైరెక్టర్ ప్రొఫెసర్ బీమరాయమేత్రి అన్నారు. హెచ్‌సీయూలోని జాకీర్ హుస్సేన్ లెక్చర్ హాల్ కాంప్లెక్స్‌లో స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ ఆధ్వర్యంలో '5 ట్రిలియన్ ఎకానమీ కోసం భారతదేశం విజన్' అనే అంశంపై మంగళవారం రాత్రి ప్రత్యేక ఉపన్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ భారతదేశంలో తయారీ రంగంపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందని, వాటిలోని సవాళ్ళు, పరిష్కరించే మార్గాలను ఆయన వివరించారు. దేశంలో జనాభా ఏటేటా పెరుగుతున్న నేపథ్యంలో ప్రతి అంశంపై నిర్దిష్ట లక్ష్యాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. హెచ్‌సీయూ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ బీజేరావు, స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ డీన్ ప్రొఫెసర్ మేరీ జెస్సికా, సమన్వయకర్త ప్రొ.లోకానందరెడ్డి, హెచ్‌సీయూ, ఐఎస్‌బీ ఫ్యాకల్టీ, పీజీ, పరిశోధక విద్యార్థులు పాల్గొన్నారు.

మోదీ హయాంలో మహిళా సాధికారత



మసీదుబండలో జీహెచ్ఎంసీ కార్మికులకు దుస్తులు పంపిణీ చేస్తున్న కేంద్ర మంత్రి దర్శన జర్దోష్ విక్రమ్

గచ్చిబౌలి: ప్రధాని నరేంద్రమోదీ హయాంలో మహిళా సాధికారత కలిగిందని రైల్వే, జౌళి శాఖ సహాయమంత్రి దర్శన జర్దోష్ విక్రమ్ పేర్కొన్నారు. శేరిలింగంపల్లి మసీదుబండలో బీజేపీ కార్యాలయంలో మహిళా స్వయం సహాయక సంఘాలు, స్వచ్ఛంద సంస్థల శక్తివందన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమంను బుధవారం నిర్వహించారు.దేశవ్యాప్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రధాని నరేంద్రమోదీ వర్చువల్ ప్రసంగాన్ని కార్యక్రమంలో పాల్గొన్న వారికి వినిపించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆమె మాట్లాడుతూ అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మహిళలకు సమాన హక్కులు కల్పించాలని డిమాండ్ చేస్తున్నారని, కానీ అన్ని రంగాలలో మహిళలు రాణించేలా ప్రోత్సహిస్తున్నారన్నారు. ప్రధాని కొత్త పార్లమెంటు హౌజ్‌లో మహిళా రిజర్వేషన్ బిల్లు పెట్టారన్నారు .మంత్రి వర్గంలో పదకొండు మంది మహిళా మంత్రులు ఉన్నారని గుర్తు చేశారు. కిసాన్ సమ్మాన్ నిధి కింద 21 కోట్ల మంది రైతుల బ్యాంకు ఖాతాలలో ఆరువేల చొప్పున జమ చేస్తున్నారన్నారు.

తెలంగాణకు టెక్స్‌టైల్స్ పార్కు మంజూరు

ప్రతిపక్షాలు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో అభివృద్ధి పనులకు ప్రధాని సమ ప్రాధాన్యత ఇచ్చారని కేంద్ర మంత్రి పేర్కొన్నారు. ఆ రాష్ట్ర ప్రభుత్వాలపై వివక్ష చూపలేదన్నారు. ప్రతిపక్షపాలిత రాష్ట్రాలు ఉన్నప్పటికీ టెక్స్‌టైల్ పార్కుల ఏర్పాటుకు ప్రకటించిన ఏడు రాష్ట్రాలలో తెలంగాణ ఒకటన్నారు. అనంతరం చేవెళ్ళ మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ 2047 నాటికి భారత్‌ను నంబర్ వన్ దేశంగా తయారు చేయాలని ప్రధాని సంకల్పించారని తెలిపారు. మహిళల ప్రమేయం లేకుండా భారతదేశం పురోగమించదని ఆయన బలంగా విశ్వసిస్తున్నారన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే భిక్షపతి యాదవ్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవికుమార్‌యాదవ్, మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు శిల్పారెడ్డి, ప్రధాన కార్యదర్శి సమతా, కార్యదర్శి సాహు శ్రీలత, అసెంబ్లీ కన్వీనర్ రాఘవేంద్రరావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలు తొలగించాలి

శంషాబాద్ రూరల్: మండలంలోని అమ్మపల్లిలో గల ప్రభుత్వ భూముల్లో వెలిసిన అక్రమ నిర్మాణాలను తొలగించాలని నర్కూడ వాసులు బుధవారం తహసీల్దార్ నాగమణికి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్వే నంబర్లు 19/1 నుంచి 19/47 వరకు ఉన్న ప్రభుత్వ భూములను సర్వే చేసి కబ్జాకు గురి కాకుండా చూడాలన్నారు. శంషాబాద్ మున్సిపాలిటీ శివారుకు ఆనుకుని ఉన్న ఈ భూముల్లో కొందరు ఇతర సర్వే నంబర్లను చూపించి కబ్జా చేస్తున్నారని ఆరోపించారు. నర్కూడ నుంచి శంషాబాద్ వెళ్లే మార్గంలో ఈ భూములను కబ్జా చేసి అక్రమంగా ఇండ్ల అనుమతులు తీసుకుని దుకాణాలు ఏర్పాటు చేస్తున్నారని పేర్కొన్నారు. కలిసిన వారిలో జి.విశ్వనాథం, పి.బల్వంత్, పి.ప్రభు, డి.ప్రభాకర్‌యాదవ్ తదితరులు ఉన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి



అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: మహిళలు ఆర్థికంగా ఎదిగి తమ కుటుంబాలకు శక్తిగా మారినప్పుడే వారికి మంచి గుర్తింపు ఉంటుందని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్ అన్నారు. బుధవారం నానల్‌నగర్ డివిజన్ హకీంపేట్‌లో గ్రేటర్ బల్దియా ఏర్పాటు చేసిన అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రతి ఏటా తమ హక్కుల కోసం గొంతెత్తుతున్న మహిళల సంఖ్య పెరుగుతుందన్నారు. మహిళల్లో వస్తున్న ఈ మార్పు ఒక శుభపరిణామన్నారు. గత దశాబ్దాలుగా కార్వాన్ నియోజకవర్గంలో మహిళల్లో వస్తున్న మార్పును తాను గమనిస్తున్నానన్నారు. తల్లులు తమ పిల్లలను ఉన్నత చదువులు చదివించేందుకు ఎంతో ఇష్టపడుతున్నారన్నారు. తమ కుటుంబాలను ఆర్థికంగా ఆదుకునేందుకు వారు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. నేడు అన్ని రంగాల్లో మహిళలే ముందుండి మార్పునకు, ప్రగతికి ఉత్సాహం చూపుతున్నారన్నారు. ఈ సందర్భంగా ఆయన పలువురు మహిళలకు బల్దియా డిప్యూటీ కమిషనర్ శశిరేఖతో కలిసి బహుమతులను అందజేశారు. బల్దియా టౌన్‌ప్లానింగ్ ఏసీపీ విజయశ్రీ, లలితకుమారి తదితరులున్నారు.

అన్ని ప్రాంతాల్లో అభివృద్ధి పనులు

కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: కార్వాన్ నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేయిస్తున్నానని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్ అన్నారు. లంగర్‌హౌజ్, టోలిచౌకీ, నానల్‌నగర్ డివిజన్‌లకు చెందిన పలువురు బుధవారం టోలిచౌకీ మెరాజ్ కాలనీలోని కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిశారు. ఈ సందర్భంగా తమతమ ప్రాంతాల్లో అభివృద్ధి పనులు పూర్తైన సందర్భంగా ఎమ్మెల్యేను పూలమాలలు వేసి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అభివృద్ధి పనులకు నిధులు సాధించడమే కాకుండా ఆ పనులను తాను స్వయంగా పర్యవేక్షిస్తుంటానన్నారు. దీంతో సంబంధిత అధికారులు ఆ పనులను పర్యవేక్షిస్తారని పనుల్లో జాప్యం జరగకుండా ఉంటుందన్నారు. వర్షాకాలం కంటే ముందే నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లో డ్రైనేజీ పనులు పూర్తవుతాయన్నారు. కార్వాన్ నియోజకవర్గంలో ప్రస్తుతం జరుగుతున్న వరద నీటి పైపులైన్ పనులు చివరి దశలో ఉన్నాయని, వచ్చే ఏప్రిల్ నెలాఖరుకు ఈ పనులు పూర్తయ్యే అవకాశం ఉందన్నారు. నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, మజ్లిస్ నాయకుడు అబీబ్ చౌష్, బేగ్ తదితరులున్నారు.

నకిలీ ట్రేడింగ్ యాప్‌తో వృద్ధుడికి టోకరా

హిమాయత్‌నగర్: నకిలీ ట్రేడింగ్ యాప్‌తో ఓ వృద్ధుడిని సైబర్ నేరగాళ్లు భారీగా మోసం చేశారు. నగర సైబర్ క్రైం పోలీసుల వివరాల ప్రకారం నగరానికి చెందిన 70 ఏళ్ల వృద్ధుడికి ఫేస్‌బుక్ ట్రేడింగ్ లాభాలు అంటూ ఆకర్శణీయమైన యాడ్ వచ్చింది. దీంతో ఆ యాడ్‌ను క్లిక్ చేయడం ద్వారా అందులో ఉన్న వాట్సాప్ నంబర్‌కు కాల్ చేశారు. సైబర్ నేరగాళ్లు ఆ వృద్ధుడిని నకిలీ ట్రేడింగ్ యాప్‌ను ఇన్‌స్టాల్ చేయించారు. తాము రీసర్చ్ చేసిన స్టాక్స్‌లో పెట్టుబడులు పెట్టడం ద్వారా అధిక లాభాలు వస్తాయని నమ్మించారు. దీంతో పలు దఫాలుగా బాధిత వృద్ధుడు వారు చెప్పిన విధంగా నకిలీ యాప్ ద్వారా లక్షల రూపాయలు చెల్లించాడు. ఈ విధంగా వారు లాభాలను సైతం ఫేక్ ట్రేడింగ్ యాప్‌లో చూపించి మరింత నమ్మించారు. విడతల వారీగా బాధితుడి నుంచి రూ. 22,16,732 పెట్టుబడులు, లాభాల పేరుతో కాజేశారు. ఆ యాప్‌లో కనిపించే డబ్బును విత్‌డ్రా చేసుకోవాలని ప్రయత్నించగా అది పనిచేయలేదు, వారి స్పందించకపోవడంతో మోసపోయానని బాధితుడు నగర సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు నగర సైబర్ క్రైం ఏసీపీ శివమారుతి తెలిపారు.

ట్రాఫిక్ బూత్‌లో డెడ్‌బాడీ : కేసు దర్యాప్తు ముమ్మరం

బంజారాహిల్స్: బంజారాహిల్స్‌లోని తాజ్‌కృష్ణా హోటల్ చౌరస్తాలో మంగళవారం తెల్లవారుజామున ట్రాఫిక్ బూత్‌లో లభ్యమైన అనుమానాస్పద మృతదేహానికి సంబంధించి బంజారాహిల్స్ పోలీసులు దర్యాప్తు వేగవంతం చేశారు. ఆ వ్యక్తి సహజ మరణమా..? రోడ్డు ప్రమాదమా..? అనే కోణంలో బంజారాహిల్స్ ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్ర నేతృత్వంలో ఐదు బృందాలు ఇక్కడ సీసీ ఫుటేజీలను జల్లెడ పడుతున్నాయి. నాలుగు పోలీసు బృందాలతో పాటు ఒక టాస్క్‌ఫోర్స్ టీమ్ ఈ రోడ్డుకు రెండువైపులా, అంతర్గత రహదారుల్లో, పంజగుట్ట, ఖైరతాబాద్, మాసబ్‌ట్యాంక్ మార్గాల్లో సీసీ ఫుటేజీలను పరిశీలిస్తున్నారు. గుర్తుతెలియని వాహనం అదుపుతప్పిన వేగంతో వచ్చి రోడ్డు దాటుతున్న వ్యక్తిని ఢీకొని ఉంటుందా..? అన్న కోణంలో పోలీసులు తనిఖీలు చేస్తున్నారు. మృతి చెందిన వ్యక్తి స్థానికంగా ఫుట్‌పాత్‌లపై నిద్రిస్తుంటాడని, ఆ రోజు ఎటువైపు నుంచి రోడ్డు దాటుతున్నాడు..ఆ సమయంలో వచ్చిన వాహనాలు ఎన్ని అన్నది పోలీసుల దర్యాప్తులో తేలనుంది. ఒకటి రెండు రోజుల్లో ఈ మిస్టరీని చేధిస్తామని పోలీసులు పేర్కొంటున్నారు.

నకిలీ అల్లం, వెల్లుల్లి పేస్టును తయారు చేస్తున్న వ్యక్తి అరెస్ట్

గౌలిపురా: ఆరోగ్యానికి హాని కలిగించే నకిలీ అల్లం, వెల్లుల్లి పేస్టులను తయారు చేస్తున్న ఓ వ్యక్తిని భవానీనగర్ పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి 155 కేజీల అల్లం, వెల్లుల్లి పెస్టు, సింథటికల్ కెమికల్ కలర్స్, 1.5 లూబ్రికెంట్ ఆయిల్ బాక్స్‌ను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ ఎం.రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం.. భవానీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మీర్ జుమ్లా ఎం.జె.ట్యాంక్ ప్రాంతానికి చెందిన మహ్మద్ మస్తాన్ (48) తన ఇంట్లో నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా ఆరోగ్యానికి హాని కలిగించే నకిలీ అల్లం, వెల్లుల్లి పెస్టులను తయారు చేస్తున్నాడు. అనంతరం పలు హోటళ్లు, కిరణాషాపులకు విక్రయించి డబ్బులను సొమ్ము చేసుకుంటున్నాడు. విశ్వసనీయమైన సమాచారం మేరకు భవానీనగర్ పోలీసులు ఫుడ్ సెఫ్టీ అధికారులతో కలిసి దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో కిరణా స్టోర్ నకిలీ అల్లం, వెల్లుల్లి పెస్టులను విక్రయిస్తున్నాడని నిర్ధారించారు. ఈ అల్లం, వెల్లుల్లి పెస్టుల సరఫరాపై ఆరా తీయగా.. మహ్మద్ మస్తాన్ సరఫరా అని పోలీసులు తెలిపారు. దీంతో దాడులు నిర్వహించి 155 కేజీలు, సింథటికల్ కెమికల్ కలర్లు, 1.5 లూబ్రికెంట్ ఆయిల్ బాక్స్‌ను స్వాధీనం చేసుకుని నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.